క్లుప్తంగా

పాఠశాల పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 43వ వార్డులో మన ఊరు –మనబడి కింద చేపట్టిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్గల్ క్షేత్రంలో వార్షికోత్సవం



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి నెలవైన వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితులు సరస్వతీ అమ్మవారికి విశేష పూజలు, చండీహోమం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



బోధిస్తున్న ఎంఈఓ యాదవరెడ్డి

సిద్దిపేటఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఎంఈఓ యాదవ రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి కేజీబీవీని సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల సందర్భంగా తీసుకుంటున్న చర్యలపై పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అర్షియాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఇబ్బందులు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించగా, పాఠశాల ఆవరణలో ఈగల బెడదను తొలగించాలని కోరారు. స్పందించిన ఎంఈఓ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో బోధన సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

దుబ్బాకటౌన్: సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5లక్షలను అందించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు భాస్కర్ డిమాండ్‌చేశారు. శుక్రవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండలంలోని పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. కార్యక్రమంలో నాయకులు కొంపల్లి భాస్కర్, దేవయ్య, లక్ష్మీనారాయణ, మల్లేశం, శ్రీనివాస్, బాల్‌రాజు, నాగరాజు ఉన్నారు.

నిర్వాసితుల హామీలను నెరవేర్చాలి



పాదయాత్రలో శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ప్రాజెక్టుల నిర్మాణంతో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్‌జోడో యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిపేట, తుక్కాపూర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ ప్రారంభోత్సవం సమయంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నేటికి నెరవేరలేదని అన్నారు. తుక్కాపూర్ గ్రామస్తులకు 200ల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పిన మాట ప్రకటనలకే పరిమితమైందని ఆయన ఆరోపించారు.

బడిలో పిల్లలు.. బయట టీచర్లు

- మధ్యాహ్నమే ఇంటిబాట
- పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థుల ఆటలు
- దారి తప్పిన పాఠశాల చదువులు



ఉమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలపై అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో సర్కారు చదువులు అటకెక్కుతున్నాయి. కొన్నిచోట్ల విద్యార్థులు లేక, మరి కొన్ని చోట్ల విద్యార్థులకు సరిపడా టీచర్లు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, వేల జీతం అందుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు పాఠాలు బోధించకుండా బయట తిరుగుతున్నారు. పాఠశాల సమయంలో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్ సొంత పనుల మీద బయటకు వెళ్లిన ఘటన హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వెలుగుచూసింది.

5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు

మండలంలోని ఉమ్మాపూర్ పాఠశాలలో 5 తరగతుల్లో 11 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నాడు. శుక్రవారం ఆరుగురు విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. ఉపాధ్యాయుడు గంట పాటు విద్యార్థులతో ఉండి, సొంత పనిమీద 8 కి.మీల దూరం హుస్నాబాద్‌కు వెళ్లాడు. దీంతో చదువు చెప్పేవారు లేక విద్యార్థులు వరండాలో కూర్చొని ఆడుకుంటున్నారు. ఉదయం పూట కనీసం ప్రార్థన కూడా నిర్వహించడంలేదని, సాయంత్రం పాఠశాల సమయం కాకముందే టీచర్ ఇంటికి వెళుతున్నట్లు తెలిసింది.

మండల వ్యాప్తంగా..

- హుస్నాబాద్ మండలంలో 48 ప్రాథమిక పాఠశాలల్లో 2,154 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 668 మంది, 9 ఉన్నత పాఠశాలల్లో 369 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రభుత్వ టీచర్లు పాఠశాలలకు ఆలస్యంగా వస్తున్నారు.
- మధ్యాహ్నం తర్వాత ఇంటి బాట పట్టడంతో విద్యార్థులు పూర్తిస్థాయి విద్య అందడంలేదు.
- హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు 9 మంది సీఆర్పీలు ఉన్నా.. సమస్యను మాత్రం పట్టించుకోవడంలేదు.
- ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతీ రోజు పాఠశాలలకు వెళ్లడం లేదని మండల వనరుల కేంద్రం ఉద్యోగులే చెప్పడం గమనార్హం.
- గతంలోని ఎంఈఓ మారంపెల్లి అర్జున్ ఊరూరా తిరిగి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేశారు.



ఉపాధ్యాయుడు లేకపోవడంతో గదిలో కూర్చున్న విద్యార్థులు

- ఆయన బదిలీ కావడం, ఉమ్మడి మండలంపై పర్యవేక్షణ కొరవడి ఉపాధ్యాయులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి.
- డిజిటల్ విద్య కోసం దాతలు ప్రాజెక్టర్లు, ఎల్‌ఈడీలను అందించినా ప్రభుత్వ బడుల్లో బోధన మెరుగుపడడంలేదనే విమర్శలు ఉన్నాయి.
- కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి టీచర్లకు వేతనాలు అందిస్తుంటే, మరోవైపు ఉపాధ్యాయులు బడికి వెళ్లకుండా సొంత పనులు చూసుకుంటున్నారు. ప్రతీ రోజు పాఠశాలకు వెళ్లని ఉపాధ్యాయులను గుర్తించి వారిపై చర్య తీసుకోవాలి.

– గుగులోతు భాస్కర్‌నాయక్, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు

విచారణ చేస్తాం

బడి సమయంలో ఉపాధ్యాయులు తప్పకుండా విద్యార్థులతో ఉండాలి. ఉమ్మాపూర్ ఉపాధ్యాయుడు పాఠశాలలో లేక పోవడంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. పాఠశాల సమయం ముగిసే వరకు ఉపాధ్యాయులు స్కూల్లో ఉండేలా చూస్తాం.

– దేశిరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంఈఓ

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ గోపాల్‌రావు

దుబ్బాక: జాతీయ ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచేందుకు అధికారులు కృషి చేయాలని డీఆర్‌డీఓ గోపాల్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో దౌల్తాబాద్, రాయపోల్ మండలాల ఎంపీడీఓలు, ఏంపీఓలు, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేపట్టిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలని, వితంతు పెన్షన్ల నమోదు వేగవంతం చేయాలని సూచించారు. 18–35 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగులకు ఎల్‌అండ్‌టీ సంస్థ ద్వారా శిక్షణ అందించి, ఉపాధి కల్పించాలని అన్నారు. సమావేశంలో దౌల్తాబాద్ ఎంపీడీఓ రాజేష్, రాయపోల్ ఎంపీడీఓ మున్నయ్య, ఎంపీఓలు సయ్యద్ గఫూర్ ఖాద్రీ, లక్ష్మీనారాయణ, ఏపీఓలు, తదితరులున్నారు.

అనుమతిలేని సెంటర్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దరిపల్లి రమేశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో అనుమతులు లేకుండా ఎస్‌ఐ, కానిస్టేబుల్, గ్రూప్స్ కోచింగ్ సెంటర్‌లు నిర్వహిస్తున్న నిర్వాహకులపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ విద్యార్థి సంఘం నాయకుడు దరిపల్లి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తరగతులు నిర్వహిస్తూ, ఇష్టారీతిగా ఫీజులు నిర్ణయిస్తూ, విద్యార్థులను దోచుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు శివ, వర్మ, రాజు, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోని తిరుమల తిరుపతి కల్యాణ మండపం పరిసరాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 6.15 గంటలకు ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో నాసర్‌పూర, కాజర్‌పూర, రాంనగర్, మంకమ్మతోట, మోహినిపూర, పారుపెల్లివీధి, భారహీమామ్‌తో పాటు మరికొన్ని కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 10 దాటినా పునరుద్ధరణ కాలేదు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

వర్గల్(గజ్వేల్): సాగునీటికి ఉపయుక్తంగా నిలుస్తున్న వర్గల్ మండలం జబ్బాపూర్ మంచికుంట మరమ్మతుకు ప్రభుత్వం రూ.13.4 లక్షల నిధులు మంజూరు చేసిందని జెడ్పీటీసీ బాలు యాదవ్, ఎంపీపీ లత తెలిపారు. ఈ నిధులతో చేపట్టనున్న కట్ట, తూము, మత్తడి, పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సమ్మ, ఇరిగేషన్ ఏఈ గురుప్రసాద్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సురేష్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను వీడనాడాలి



మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు సాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మూఢనమ్మకాలను వీడనాడాలని గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొట్యాలలో గురువారం గ్రామస్తులకు గంజాయి, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తుకు బానిస కావొద్దని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రంగ కృష్ణ, సర్పంచ్ గణేష్ గుప్తా, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న మాస్టర్లు

దుబ్బాక: శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం సొంతం అవుతుందని పిరమిడ్ పీచ్‌వల్ సొసైటీ మాస్టర్స్ బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింగరావు అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే ధ్యానం అలవాటు చేసుకోవాలని, దీనితో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నె రంగమ్మ, కొండ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ రమేష్, మాస్టర్లు ప్రశాంత్, నర్సింలు, మల్లేశం, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, తదితరులున్నారు.

మార్కండేయ ఆలయ వార్షికోత్సవం



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కార్యవర్గ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని మార్కండేయ ఆలయ 60వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ఏకాదశ రుద్రం, రుద్ర హవనం, పార్వతీ పరమేశ్వర కల్యాణం, పూర్ణావతి, అవబత స్నానం, ఋత్విక్సన్మానం, మహాదాశీర్వచనం, అన్నదానం, పార్వతి పరమేశ్వరుల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. వీరికి ఆలయ కార్యవర్గ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కాముని రాజేశం, ఉపాధ్యక్షులు అశోక్, శ్రీహరి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, సహాయ కార్యదర్శి రవితేజ, కోశాధికారి శ్రీనివాస్, బాలకిషన్, బాలరాజు, ప్రసాద్, రాజ్ కోటి, శ్రీనివాస్, కొండరాజు, భాస్కర్, మధుసూదన్, జలజ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): రిజిస్ట్రేషన్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో ఆధ్వర్యంలో ఎస్‌ఆర్వో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి మయంగా మారిందని, అధికారులు ప్రతీ పనికి డబ్బులు వసూలుచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలతో సతమతం అవుతుంటే, అధికారులు లంచాలు ఇవ్వాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, భాస్కర్, ఎల్లయ్య, శోభ, కనకయ్య, బాలు, రంజిత్‌రెడ్డి, చంద్రం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దంపతులకు శుభాకాంక్షలు



నూతన జంటతో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, తదితరులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు కుమారుడు సాయి కుమార్–మనీషాల వివాహ వేడుక శుక్రవారం పత్తి మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్ రావు, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, ఫారూఖ్ హుస్సేన్ తదితరులు వేడుకలో పాల్గొని కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా స్వయం పాలన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు, శ్రీనివాస్, పీడీ రామేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించడాన్ని ఖండిస్తూ డీబీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం గజ్వేల్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద దేశంలో కూలీలకు పని కల్పించేందుకు రూ.3లక్షల కోట్లు అవసరం కాగా కేవలం రూ.35వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదని అన్నారు. ఆధార్ అప్‌డేషన్, ఎన్‌ఎంఎంఎస్ వంటి కూలీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, వంద రోజుల పని కల్పించకుండా కేంద్రం పని హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. తెలంగాణ, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో అవినీతి జరుగుతుందనే సాకుతో నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అనంతరావుపల్లి సర్పంచ్ దాసరి మహేందర్, ఎమ్మార్పీ నాయకులు మైస రాములు, డీబీఎఫ్ నాయకులు ఏగొండస్వామి, వేణు, మహేందర్, బాబు, కనకయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి రివార్డు

సిద్దిపేటరూరల్: ఉగాది సందర్భంగా షార్ వాణి పత్రిక (శ్రీహరి కోట, నెల్లూరు)లో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్ర లేఖన పోటీలో నారాయణ రావు పేట మండలం జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కోడి అజయ్ ప్రతిభ చూపినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కొమ్మూరి పద్మ తెలిపారు. పోటీలోద్వితీయ బహుమతి సాధించిన అజయ్‌ను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య, రాజు, రాజేందర్, లక్ష్మీనర్సయ్య, తిరుపతి, మల్లారెడ్డి, చెన్నకేశవులు, దయానంద్, భాగ్యలక్ష్మి, ప్రసన్న లక్ష్మి, అఖిల పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు కష్ట పడి చదువుకుంటే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ గజ్జెల సాయిలు అన్నారు. మండలంలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రజాప్రతినిధులతో కలిసి రీడింగ్ రూంను ప్రారంభించారు. విజ్ఞానం అందించే పలు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, కో ఆప్షన్ ఎండీ.అహ్మద్, నాయకులు మాచపురం యాదగిరి, టీచర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నిధుల మంజూరుపై హర్షం

హుస్నాబాద్: హుస్నాబాద్ ఏసీపీ ఆఫీస్ భవన నిర్మాణానికి రూ.2.84 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, నిధులు మంజూరు చేసినందుకు గాను సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

◆ సద్వినియోగం చేసుకోవాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొక్కుల కీర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండారెడ్డిపల్లిలో సర్పంచ్ ఓరుగంటి అశోక్‌రెడ్డితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీటీసీ కళ్యాణి, ఉపసర్పంచ్ రాములు, కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని వర్దరాజ్‌పూర్ గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 400 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, నాయకులు కనకయ్య, వార్డు సభ్యులున్నారు.

◆ అంధత్వ నివారణకు కంటి వెలుగు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాట్లపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీ కావ్య, కో ఆప్షన్ ఏక్బాల్, ఉపసర్పంచ్ ఆజాం, కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ నరేష్ క్రీడాకారులకు దుస్తులను అందించారు.

బెజ్జంకి(సిద్దిపేట): కంటి వెలుగు పథకాన్ని సద్దినియోగం చేసుకోవాలని ఎంపీపీ లింగాల నిర్మల సూచించారు. మండలంలోని దాచారంలో కంటి వెలుగు పథకాన్ని శుక్రవారం జడ్పీటీసీ కనగండ్ల కవితతో కలిసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ దమ్మని రాము, సర్పంచ్ం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మోడల్ స్కూల్ ప్రవేశాలు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చేరాలనుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని రేబర్తి, వంగపల్లి, తోర్నాల గ్రామాల్లో పర్యటించి ప్రవేశాలపై అవగాహన కల్పించారు. ఈనెల 15 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ ఉపాధి కల్పించాలి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కోకన్వీనర్ శివలింగు కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మల్లన్నసాగర్ నిర్మాణంతో ముంపునకు గురైన బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సీపీఐ నాయకులు రాజు, యాదగిరి, రాజాం, స్వామి, భాస్కర్ ఉన్నారు.

◆ పాఠశాలకు బీరువా అందజేత

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ బాలుర పాఠశాలకు పూర్వ విద్యార్థులు బీరువా అందజేశారు. శుక్రవారం పాఠశాల హెచ్‌ఎంకు బీరువాను బహూకరించారు. పూర్వ విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ వైర్లు తగిలి చెట్టుకు మంటలు

దుబ్బాకరూరల్: దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న చెట్టుకు విద్యుత్ వైర్లు తగలడంతో పూర్తిగా మాడి పోయింది. కళాశాలలో విద్యార్థులు తిరుగుతుంటారు. విద్యుత్ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కళాశాల సిబ్బంది కోరుతు

◆ నిత్యావసరాలు అందజేత

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని చర్లఅంకిరెడ్డిపల్లి శివారులో అనాథ వృద్ధాశ్రమానికి సిద్దిపేట అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధనుంజయ్, వేదశ్రీ దంపతులు నిత్యావసరాలను అందించారు. పండ్లు, బ్రెడ్‌తో పాటు నగదును శుక్రవారం ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ కోఆర్డినేటర్ ఆత్మరాములు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో అనాథలు, పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అంజయ్య, వైకుంఠం, శివానందం, అరుణ పాల్గొన్నారు.

◆ అర్హులకే ఇళ్లు ఇవ్వాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో మాట్లాడారు. అధికారులు ప్రకటించిన జాబితాలో అర్హులకు అన్యాయం జరిగిందని, మున్సిపాలిటీలో ఇళ్లు లేని పేదలను గుర్తించి అర్హులను ఎంపిక చేయాన్నారు.

◆ ఆర్థికసాయం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గొల్లపెల్లి గ్రామంలో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందిన బైరి సదయ్య అంత్యక్రియలకు ఆల్ ఇండియా బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ధరావత్ తిరుపతినాయక్ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్ నాయకులు సాయం చేశారు.

◆ పనులు త్వరగా పూర్తి చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ దమ్మని రాము అధికారులకు సూచించారు. మండలంలోని కల్లెపెల్లి, గుండారం ప్రభుత్వ పాఠశాల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.

◆ ఆత్మ రక్షణకు కరాటే

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆత్మ రక్షణకు కరాటే దోహద పడుతుందని ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్, తిగుల్, మునిగడప, దౌలాపూర్ తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కరాటే తరగతులను ప్రారంభించారు. విద్యార్థులు విద్యతో పాటు కరాటేలో రాణించాలన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ బాధితుల రిలే దీక్ష

కొండపాక(గజ్వేల్): భూమి ఫౌతీ విషయంలో కుకునూరుపల్లి తహసీల్దార్ ఏకపక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. న్యాయం జరిగే వరకు దీక్ష చేస్తామని బాధితులు తెలిపారు. కార్యక్రమంలో బాధితులు ఈగ శంకరయ్య కుటుంబీకులు, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.